క్లుప్తంగా

శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోండి



వేసవి శిక్షణ తరగతుల్లో ప్రసంగిస్తున్న బుల్లియ్య

పెద్దాపురం: శాఖా గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పెద్దాపురం ప్రథమ శ్రేణి గ్రంథాలయ అధికారి పాలంకి నాగరాజు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం శిక్షణ తరగతులనుద్దేశించి ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఈ తరగతులు ఎంతగానో దోహదపడతాయన్నారు. విద్యార్థులను ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహిస్తే అద్భుతాలను సృష్టిస్తారన్నారు. ఉపాధ్యాయుడు రాళ్లపల్లి వెంకటేశ్వరరావు, సింగం బుల్లియ్య పాల్గొన్నారు.

పెరిగిన భవన నిర్మాణ కూలి ధరలు

సామర్లకోట: నిత్యావసర సరకుల ధరలను దృష్టిలో ఉంచుకుని భవన నిర్మాణ కూలి ధరలు పెంచాల్సిన పరిస్థితి ఏర్పడిందని భవన నిర్మాణ కార్మిక సంఘ పట్టణ శాఖ అధ్యక్షుడు ప్రకృతి ఈశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జూన్ ఒకటి నుంచి భవన నిర్మాణ రంగంలో పనిచేసే వారికి సవరణ చేసిన విధంగా భవన నిర్మాణ యజమానులు కూలి చెల్లించాలన్నారు. తాపీమేస్త్రికి రూ.850 నుంచి రూ.900, కూలీకి రూ.700 నుంచి రూ.750కి పెంచి కూలి ధరలనిర్ణయించామని తెలిపారు. సంఘం నిర్ణయించిన కూలి కంటే ఎక్కువ కూలీ వసూలు చేస్తే సీఐటీయూ దృష్టికి తీసుకురావాలన్నారు. దీనికి భవన నిర్మాణ యజమానులు సహకరించాలన్నారు.

స్వచ్ఛతే లక్ష్యంగా పని చేయాలి



సామర్లకోట రైల్వే స్టేషన్‌లో పరిసరాలను శుభ్రం చేసిన రైల్వే మేనేజర్ తదితరులు

సామర్లకోట: రైల్వే స్టేషన్ పరిసరాలు స్వచ్ఛంగా ఉండే విధంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని రైల్వే స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ముందుగా ప్రయాణికులకు అవగాహన కల్పించారు. రైల్వే స్టేషన్ పరిధిలో చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. చెత్తను డస్ట్‌బిన్లలో మాత్రమే వేయాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కేవీ గిరి, హెల్త్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న మత్స్యకారులు

కాకినాడ సిటీ: సముద్ర తీరంలో చమురు ఉత్పత్తి కార్యకలాపాలతో వేట కష్టమై జీవనభృతి కోల్పోతున్నామని యు.కొత్తపల్లి మండలం మూలపేట గ్రామాల మత్స్యకారులు సోమవారం కాకినాడ కలెక్టరేట్ వద్ద నిరసన ర్యాలీ, ధర్నా నిర్వహించారు. జిల్లాలో రిలయన్స్, ఓఎన్జీసీ, ఎస్ఆర్ గుజరాత్, దివీస్, అరబిందో, కాకినాడలో ఉన్న ఆయిల్ ఫ్యాక్టరీలు, ఎన్ఎఫ్‌సీఎల్, కోరమాండల్, షుగర్ ఫ్యాక్టరీల నుంచి వచ్చే కెమికల్ వాటర్, క్రూడ్ ఆయిల్ సముద్రపు అడుగు భాగంగా సుమారు 100 నుంచి 200 కిలో మీటర్ల మేర వ్యాపించడం వల్ల మత్స్య సంపద కోల్పోయి నష్టపోతున్నామని ఆందోళనకారులు ఆవేదన వ్యక్తం చేశారు. తాము చమురు సంస్థలకు వ్యతిరేకం కాదని, వారి కార్యకలాపాలతో బతుకు తెరువు పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సముద్ర వేట తప్పితే మరే ఇతర భూమిగానీ, వ్యాపారంగానీ లేవన్నారు. అందువల్ల ముమ్మిడివరం, యానాం నియోజకవర్గాల్లో మత్స్యకారులకు ప్రతి నెలా ఏ విధంగా రూ. 11,500 ఇస్తున్నారో అదే విధంగా కాకినాడ సిటీ, రూరల్, యు.కొత్తపల్లి, తొండంగి మండలాల్లో ఉన్న మత్స్యకారులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వేట సమయంలో అనుకోని ప్రమాదం జరిగితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ. 50 లక్షల జనరల్ ఇన్సూరెన్స్ ఇవ్వాలని అన్నారు. ఈ కంపెనీల్లో నూటికి 20 శాతం మత్స్యకారులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు, రమణిలతో పాటు అధిక సంఖ్యలో మత్స్యకారులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు

కొత్తపల్లి: ప్రభుత్వం రేషన్ డిపోల ద్వారా అందించే సరకుల్లో డీలర్లు అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దార్ చిన్నారావు హెచ్చరించారు. స్థానిక రేషన్ డిపోలో సరకుల పంపిణీ విధానాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్నారావు మాట్లాడుతూ వృద్ధులు, వికలాంగులకు ఇంటికెళ్లి సరకులు అందించాలన్నారు. ఏ రేషన్ డిపోలో అయినా సరకులు పొందవచ్చన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సమయ పాలన పాటించాలన్నారు. తూనికల్లో తేడాలు రానీయొద్దన్నారు.

సూపర్ సిక్స్.. సర్దేశారని ఫిక్స్

- పథకాలు ఇస్తామని 'కూటమి' మోసం
- ఆవేదనతో ఉన్న ప్రజలకు అండగా 'వెన్నుపోటు దినం'
- 4న కదం తొక్కడానికి సిద్ధమవుతున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

పిఠాపురం: కూటమి నేతలు ఎన్నికల సమయంలో అధికారం కోసం సూపర్ సిక్స్ పేరుతో పథకాలు ఇస్తామంటూ చేసిన వాగ్దానాలు మోసపూరితమని తేలిపోయింది. వాటితో పాటు ఇతర పథకాలు అమలు చేయకుండా ప్రజలను నిండా ముంచేయడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంపై ఇప్పటికే ప్రజలు పోరుబాట పడుతున్నారు. హామీలు అమలు చేయక పోగా ఉన్న పథకాలను తీసేస్తున్న వైనంపై మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆవేదనతో ఉన్న ప్రజలకు అండగా వైఎస్సార్ సీపీ ఉంటూ ఈ నెల్ 4వ తేదీన వెన్నుపోటు దినం పేరుతో నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చింది. దీనికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తుండడంతో వైఎస్సార్ సీపీ శ్రేణులు ఆ రోజు కదం తొక్కడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఆ రోజు నిర్వహించే కార్యక్రమంలో కూటమి ప్రభుత్వ మోసాలను ఎండగట్టాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాజీ ఎంపీ వంగా గీత విశ్వనాథ్ పార్టీ శ్రేణులకు ఇప్పటికే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులు భారీ ఏర్పాటు చేస్తున్నారు.

కదలిరండి.. విజయవంతం చేద్దాం

కొత్తపల్లి: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో



గొల్లప్రోలులో 'వెన్నుపోటు దినం' వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వంగా గీత, తదితరులు

పాటు ప్రజలను చంద్రబాబు అన్ని రకాలుగా మోసం చేస్తున్నారని పిఠాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇంచార్జి వంగా గీత అన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు బుధవారం చేపట్టనున్న వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలని వాకతిప్పలో వైఎస్సార్ సీపీ నాయకుడు రావు చిన్నారావు కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ చంద్రబాబు మోసాన్ని ప్రజలకు వివరించేందుకు పిఠాపురంలో వెన్నుపోటు దినాన్ని ప్రజల భాగస్వామ్యంతో భారీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దీనిని అంతా కలసి విజయవంతం చేద్దామని అన్నారు. అక్రమ కేసులు, కక్ష సాధింపు చర్యలపై కాకుండా పరిపాలనపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. కష్టపడిన నాయకులకు తమ పార్టీలో గుర్తింపు ఎప్పుడూ ఉంటుందన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, రావు చిన్నారావు, మాజీ సర్పంచ్ వర్ధి నాగమణి, పార్టీ చేనేత విభాగ అధ్యక్షుడు గోపి హరిబాబు, కొప్పిశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వాకతిప్పలో పార్టీ కార్యకర్తలతో మాట్లాడుతున్న వంగా గీత

ఉచిత బస్సు ఎక్కడ!



సూపర్ సిక్స్ అన్నారు.. అధికారంలోకి వస్తే అన్ని వర్గాలకు సంక్షేమం అన్నారు. తీరా అధికారంలోకి వచ్చాక ఏ ఒక్క పథకం అమలు చేయలేదు. ముఖ్యంగా మహిళలకు ఉచిత బస్ సౌకర్యం అంటే నిజమని నమ్మాం. ఏడాది నుంచి అదిగో ఇదిగో అంటున్నారు తప్ప ఉచిత బస్ ఎక్కడా కనిపించడం లేదు. ఇవ్వలేనప్పుడు చెప్పడం దేనికి. ఇక ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదు.

–పోసిన శ్రీలక్ష్మి, నర్సింగపురం, పిఠాపురం మండలం

ప్రజల అందరి కోసమే..



ఆవేదనతో ఉన్న ప్రజలకు అండగా వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమం ప్రజలందరి కోసమే. ప్రజలకు హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వ పెద్దల మోసాలను ఎండగట్టడానికే. 'సూపర్ సిక్స్'తో పాటు మరో 143 హామీలు ఇచ్చిన చంద్రబాబు, ఏడాది గడిచినా ఒక్క దానినీ కూడా అమలు చేయలేదు. కూటమి ప్రభుత్వ మోసాలపై నిలదీయడానికి 'వెన్నుపోటు దినం' నిర్వహిస్తున్నాం. దీనిని విజయవంతం చేద్దాం.

–వంగా గీతా విశ్వనాథ్, మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి

వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేద్దాం



సామర్లకోటలో వెన్నుపోటు దిన పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

సామర్లకోట: వైఎస్సార్ సీపీ పిలుపు మేరకు ఈ నెల 4న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అయ్యారక సంఘ అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం స్థానికంగా వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ స్వగృహం వద్ద వెన్నుపోటు దిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడవడం పట్ల వెన్నుపోటు దినాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రతి నియోజకవర్గ పరిధిలో జరిగే కార్యక్రమంలో భాగంగా 4న పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయం ముట్టడికి ప్రతి గ్రామం, మండల పరిధిలో నుంచి ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, బాధితులు అధిక సంఖ్యలో తరలి రావాలన్నారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు పాగా సురేష్‌కుమార్, సొసైటీ మాజీ అధ్యక్షుడు మేకా శ్రీనివాసరావు, రెడ్నం దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ధర్నా

సామర్లకోట: పట్టణ, మండల పరిధిలోని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ నాయకులు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఎన్నికల హామీలో భాగంగా పట్టణంలో రెండు సెంట్లు, మండలంలో మూడు సెంట్ల స్థలాలు ఇవ్వాలని, ఇళ్ల నిర్మాణానికి రూ. ఐదు లక్షల సాయం అందజేయాలని నినాదాలు చేశారు. కూటమి నాయకులు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏడాది పూర్తయినా ఇప్పటి వరకూ సూపర్ సిక్స్, ఇళ్ల స్థలాల మాటే లేదని ఆరోపించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రతి మండలంలో ఇళ్ల స్థలాల సమస్యపై ధర్నాలు చేస్తున్నామన్నారు. కూటమి నాయకులు ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఇళ్ల స్థలాల కోసం ఆయా పరిధిలో సచివాలయాల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలన్నారు. ఆ విధంగా వచ్చిన దరఖాస్తుల మేరకు భూముల సేకరణ చేస్తామని చెప్పారు. ఆందోళనకు సీపీఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బొడకొండ, పట్టణ కార్యదర్శి పెదిరెడ్డి సత్యనారాయణ, సీపీఐ నాయకులు మడగల రమణ, పెదిరెడ్ల అర్జునరావు, బర్ల లక్ష్మీనారాయణ నాయకత్వం వహించారు.



సామర్లకోట తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో పేదల ధర్నా

ఒంటి కాలిపై నిలబడి కార్మికుల నిరసన

సామర్లకోట: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ సామర్లకోట మున్సిపల్ ఇంజినీరింగ్ కాంట్రాక్టు కార్మికులు చేస్తున్న సమ్మె సోమవారంతో 28వ రోజుకు చేరుకుంది. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురుగా వారు ఒంటి కాలితో నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ నెలకు రూ.13 వేలు చేతికి వస్తే తమ కుటుంబాలను పెరిగిన ధరలతో ఎలా పోషించుకోవాలన్నారు. మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులుగా 15 ఏళ్లు దాటి పనిచేస్తున్న వారిని పర్మినెంట్ చేయాలని, విధి నిర్వహణలో చనిపోతే రూ.10 లక్షలు, అంగవైకల్యానికి రూ. ఐదు లక్షల నష్ట పరిహారం చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, స్కిల్ వర్కర్లకు రూ.29,200, నాన్ స్కిల్ వర్కర్లకు రూ.24,500 కార్మిక చట్టం ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సెలవులు వర్తింపజేయాలని కోరుతూ సమ్మె చేస్తున్నామన్నారు. గతంలో ఏడు నెలల క్రితం సమ్మె చేయగా సమస్యలు



ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలుపుతున్న ఇంజినీరింగ్ కాంట్రాక్ట్ కార్మికులు

పరిష్కరిస్తామని సీడీఎంఏ హామీ ఇచ్చి ఇప్పటి వరకు సమస్యలు పరిష్కరించక పోవడంతో ఈ నెల 7వ తేదీ నుంచి సమ్మె ప్రారంభించినట్లు కార్మిక సంఘ నాయకులు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య యూనియన్ ప్రతినిధులతో చర్చలు జరిపారు. రాష్ట్రంలో 10 మున్సిపాలిటీలు మాత్రమే సమ్మె చేస్తున్నారని సమ్మె విరమించాలన్నారు. వేసవి కాలంలో తాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని సమ్మె విరమించక పోతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటామని హెచ్చరించారు. సోమవారం సాయంత్రం చర్చలతో సమ్మెతో ఒక నిర్ణయం వస్తుందని యూనియన్ ప్రతినిధులు కమిషనర్‌కు తెలిపారు.

సీతారామస్వామి భూములు స్వాధీనం చేసుకోవాలి

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): దేవదాయ శాఖకు చెందిన భూములు వేరే వ్యక్తులు స్వాధీనం చేసుకున్నా అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని యు.కొత్తపల్లి మండలం గోర్స గ్రామస్తులు వాపోయారు. ఈ మేరకు కాకినాడ దేవదాయ శాఖ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. గోర్సలో సీతారామస్వామికి చెందిన 19.92 ఎకరాలను కొన్నేళ్లుగా 24 మంది అనుభవిస్తున్నారని ఆందోళనకారులు అన్నారు. దీనిపై ట్రిబునల్‌లో కేసు ఉన్నా ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోనే భూమి ఉందన్నారు. గత నెల 4న భూమిని స్వాధీనం చేసుకునేందుకు నోటీసులు ఇచ్చి దేవదాయ శాఖ అధికారులు పోలీసుల సహకారం కోరినా అదే రోజు ఎమ్మెల్సీ నాగబాబు వస్తున్నారని బందోబస్తు ఇవ్వలేమని చెప్పడంతో భూమి స్వాధీనం చేసుకోలేదన్నారు. దేవదాయ శాఖ అధికారులు భూమిని స్వాధీనం చేసుకునేందుకు షాకులు చెబుతున్నారంటూ గ్రామస్తులు దేవదాయ శాఖ కార్యాలయానికి తాళాలు వేసేస్తామని అధికారులను హెచ్చరించారు. దీంతో జిల్లా దేవదాయ శాఖాధికారి ఈవీ సుబ్బారావు వారికి నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. చివరికి దేవదాయశాఖ డీసీ రమేష్‌బాబు వచ్చి భూములు స్వాధీనం చేసుకునేందుకు చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పడంతో వారు శాంతించారు. తొలుత గ్రామస్తులు జిల్లా కలెక్టర్ షణ్మోహన్‌కు వినతిపత్రం సమర్పించారు.



దేవదాయ శాఖ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గోర్స గ్రామస్తులు

లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై అవగాహన

పెద్దాపురం: గర్భస్థ లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణి ఆదేశించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ చాంబర్‌లో సోమవారం డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ పి.సరిత అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ అల్ట్రాసౌండ్ వైద్య పరీక్షలను లింగ నిర్ధారణ పరీక్షలకు ఉపయోగించడం చట్టరీత్యా నేరమన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. డాక్టర్ సరిత మాట్లాడుతూ పెద్దాపురం డివిజన్ పరిధిలో 40 స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్, రెన్యూవల్, డెకాయ్ ఆపరేషన్లపై ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నామని అన్నారు. మొదటిసారి తప్పు చేసిన వారికి చట్ట ప్రకారం మూడేళ్ల పాటు జైలు, రూ.10 వేల జరిమానా, రెండో సారి తప్పు చేస్తే ఐదేళ్ల జైలు, రూ.50 వేల జరిమానా విధిస్తారన్నారు. చట్టంపై అవగాహనకు 715 సచివాలయ కేంద్రాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో వైద్యులు అనూష, సత్యవంశీ, రాజేశ్వరి, న్యాయవాదులు కందుల వెంకటాచలం, సత్య రవికుమార్, ఎన్జీఓ సభ్యులు వాసవి, వైద్య సిబ్బంది రమణమ్మ, వీరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీరమణి

వైభవంగా మరిడమ్మ గరగ ఉత్సవం



మరిడమ్మ వారి ఆలయం వద్ద తొలి గరగ ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ వారి తొలి గరగ ఉత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.వి జయలక్ష్మి ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఈ వేడుక చేపట్టారు. ఈ సందర్భంగా ఈఓ విజయలక్ష్మి మాట్లాడుతూ ఏటా ఆషాఢ మాస ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి గరగ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా 24న అమ్మవారి జాతర ఉంటుందని అన్నారు. 25వ తేదీ నుంచి జూలై 31వ తేదీ వరకు అమ్మవారి జాతర మహోత్సవాలు ఉంటాయని, అధిక సంఖ్యలో భక్తులు తరలిరావాలని కోరారు. ఉదయం అమ్మవారికి మఖ నక్షత్ర పూజలు ఘనంగా నిర్వహించారు. పంచామృతాభిషేకం, పసుపు, కుంకుమ, చందనం, విబూదిలతో ప్రత్యేక అభిషేకాలు చేశారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



పోటీల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్

పెద్దాపురం: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 5న పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ) ఆధ్వర్యంలో చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్లు పీసీసీ గౌరవాధ్యక్షుడు బుద్ధా శ్రీనివాస్ తెలిపారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో సోమవారం చిత్రలేఖన పోటీల వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ నెల 5న సాయంత్రం మూడు గంటలకు యాసలపు సూర్యారావు భవనంలో చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తామన్నారు. 3, 4, 5 తరగతులకు సబ్ జూనియర్స్ విభాగం, 8, 9, 10 తరగతుల విద్యార్థులకు సీనియర్స్‌గా ఇంటర్‌పైన ఉన్న విద్యార్థులకు సూపర్ సీనియర్స్ విభాగంలో పోటీలు ఉంటాయన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు 4వ తేదీ సాయంత్రానికి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు డ్రాయింగ్ షీట్‌లు ఇస్తామని, మిగిలిన చిత్రలేఖన మెటీరియల్ వారే తెచ్చుకోవాలన్నారు. పేర్లు నమోదు చేసుకునే వారు 79016 97939, 94417 09187 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి రొంగల అరుణ్, కోశాధికారి కూనిరెడ్డి రవికుమార్, అమృత, నమ్రత, అంజలి, అనూష, బంగారం, సాయి, నాని, లోకేష్, యోగేష్, జస్విత తదితరులు పాల్గొన్నారు.

నేరేడు కానరాదు

- ఈ పండ్లలో ఎన్నో ఆరోగ్య గుణాలు
- చెట్ల నరికివేతతో ఇబ్బందులు

సామర్లకోట: నేరేడు... ఈ పండ్లను దివ్య ఔషధంలా చెబుతుంటారు.. ప్రకృతి సిద్ధంగా లభించే పండ్లలో ఇదొకటి. వేసవిలో వచ్చే మామిడి పండ్ల తరువాత నేరేడుదే కీలక పాత్ర. అలాంటి నేరేడు చెట్టు దాదాపు కనుమరుగవుతోంది. గతంలో నేరేడు చెట్లు సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం, ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో విరివిగా ఉండేవి. అలాగే వీకే రాయపురం, పీబీ దేవం, మేడపాడు, జి.రాగంపేట, వడ్లమూరు గ్రామాల్లో ఎక్కువగా పెంచేవారు. అయితే ఆయా ప్రాంతాల్లో భూములు లే అవుట్లుగా మారడంతో చెట్లను నరికేశారు. విస్తరణ శిక్షణ కేంద్రంలో సుమారు 100 చెట్లను తొలగించారు. దాంతో రాబోయే తరం వారికి నేరేడు పండ్లు అంటే తెలియని పరిస్థితి వచ్చింది. చెట్లను నరికేయడంతో పాటు ఉన్న చెట్ల నుంచి పండ్లు సేకరించి అమ్మేవారి సంఖ్య తగ్గడంతో ప్రజలకు నేరేడు పండ్లు అందుబాటులోకి రావడం లేదు. అక్కడక్కడా సైకిళ్లపై తిరిగి నేరేడు పండ్లు విక్రయిస్తున్నారు. కిలో రూ.100కు అమ్ముతున్నారు. ఈ పండ్లను రోజూ కనీసం రెండు తింటే మంచిదని డాక్టర్లు చెబుతున్నారు. ఈ చెట్టు బెరడు, ఆకులను ఆయుర్వేద మందుల్లో ఉపయోగిస్తారని అంటున్నారు.

లాభాలు ఇవీ..

ఈ పండ్లు తింటే మూత్ర సంబంధ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. నీరసం, నిస్సత్తువ ఉన్న వారికి తక్షణశక్తి వస్తుంది. వెన్ను, నడుం, మోకాళ్ల నొప్పులను నయం చేస్తుంది. జిగట విరేచనాలతో బాధపడే వారికి నేరేడు పండ్ల రసాన్ని రెండు నుంచి మూడు చెంచాల చొప్పున ఇవ్వడం ద్వారా శక్తి పెరగడంతో పాటు పేగుల కదలికలు నియంత్రణలోకి వస్తాయి. కాలేయం పనితీరు క్రమబద్ధీకరించడానికి దివ్య ఔషధంలా పని చేస్తుందని, ఇలా ఎన్నో మంచి గుణాలు ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు.



నేరేడు పండ్లు విక్రయిస్తున్న వ్యాపారి

పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వాలి



నేరేడు పండ్లు తినడం వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయని పెద్దలు చెబుతుంటారు. ప్రస్తుతం వ్యాపారులు కాకినాడ, రాజమహేంద్రవరం వంటి పట్టణాల్లోనే విక్రయిస్తున్నారు. కిలో రూ.100 చెబుతున్నారు. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, చెరువు గట్లపై నేరేడు మొక్కలు పెంచడానికి ప్రాధాన్యం చూపాలి.

–ఇంటి వెంకట్రావు, రైతు, వీకే రాయపురం

ఎంతో మేలు



నేరేడు మధుమేహం వ్యాధిని చాలావరకూ తగ్గిస్తుంది. భోజనం చేసిన గంట తరువాత ఈ పండ్లు తీసుకుంటే ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. ప్రస్తుత సీజన్‌లో వచ్చే ముంజులు, మామిడి పండ్లు, నేరేడు పండ్లు తినడం వల్ల ఎంతో మేలు జరుగుతుంది.

–డాక్టర్ పసల సత్యానందరావు, పెద్దాపురం

సమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్



పెద్దాపురంలో అర్జీదారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీరమణి

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి వారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసల్ సిస్టమ్) నిర్వహిస్తున్నట్లు పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణి అన్నారు. ఇందులో భాగంగా డివిజన్‌లో ఆయా మండలాల నుంచి ఏడు అర్జీలు వచ్చాయని ఆమె తెలిపారు. అనంతరం ఆర్డీఓ శ్రీరమణి విలేకర్లతో మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖలకు బదిలీ చేసి సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో కార్యాలయ ఏఓ మాధవరావు, డీటీ భానుకుమార్, సీడీపీఓ ఉష తదితరులు పాల్గొన్నారు.